క్లుప్తంగా

క్రికెట్ పోటీలు ప్రారంభం



కార్యక్రమంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు కాపుతుంగ్లాంలోఉమా రామలింగేశ్వర స్వామి తీర్థ మహోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను ఆదివారం అగనంపూడి అభివృద్ధి కమిటీ చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ ప్రారంభించారు. గ్రామ నాయకుడు కరణం ముత్యాల నాయుడు మాట్లాడుతూ యువతకు క్రీడా పోటీలు, మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించి ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. గ్రామ నాయకుడు సాలాపు మురళి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు గంతకోట అప్పారావు, శ్రమశక్తి అవార్డు గ్రహీత కంచిపాటి ప్రకాష్, మజ్జి సూర్య, గోకాడ రాము, గణేష్ పాల్గొన్నారు.

నిత్యావసర సరకుల వితరణ



ఆశ్రమంలోని పిల్లలకు సరకులు అందజేస్తున్న మంత్రి శ్యామ్ ప్రసాద్

పెదగంట్యాడ: కెప్టెన్ మంత్రి రామారావు జయంతిని పురస్కరించుకుని ఆయన తనయుడు, మానవ హక్కుల సమితి కార్యదర్శి మంత్రి శ్యామ్ ప్రసాద్ ఆదివారం జనరేషన్ యువ అనాథ ఆశ్రమంలోని పిల్లలకు ఆదివారం నిత్యావసర సరకులు అందజేశారు. కార్యక్రమంలో మంత్రి గోపి, రౌతు గోవింద్, ఎస్వీ రమణ, శ్రీరాములు, విజయ భారతి, చంద్రశేఖర్, లావణ్య పాల్గొన్నారు.

నిర్వాసితులకు న్యాయం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నిర్వాసితుల సంఘం నాయకులు

పెదగంట్యాడ: విశాఖ ఉక్కు కోసం భూములు కోల్పోయి ఉపాధి లేకుండా పోయిన 8500 మంది నిర్వాసితులకు వెంటనే న్యాయం చేయాలని నిర్వాసితుల ఐక్య సంఘం అధ్యక్షుడు పితాని భాస్కరరావు కోరారు. నడుపూరులోని ఉక్కు కళావేదికలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించి ఉక్కు యాజమాన్యంపై ఒత్తిడి తీసుకువచ్చి నిర్వాసితులకు ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో మిగులు భూములు పంచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఉమ్మిడి అప్పారావు, చట్టి తాతారావు, నరసింగరావు, అవతారం, అప్పలరెడ్డి, ప్రసాద్, రాజు, వెంకటలక్ష్మి, ప్రకాష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం కూడా సహకరించాలి



ఎమ్మెల్యే పల్లాను సత్కరిస్తున్న ఉక్కు అధికారుల సంఘం నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌కు పూర్వవైభవం తేవడానికి కేంద్ర ప్రభుత్వంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం నుంచి కూడా సాయం అందేలా సహకరించాలని ఉక్కు అధికారుల సంఘం (సీ) ప్రధానకార్యదర్శి కె.వి.డి. ప్రసాద్, ఉపాధ్యక్షులు చంద్ర వెంకటేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి నరసింహ కోరారు. ఆదివారం వారు గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును కలిసి కేంద్రం నుంచి రూ. 11,440 కోట్లు అందేలా సహకరించినందుకు అభినందనలు తెలిపారు. స్టీల్‌ప్లాంట్ సమస్యలకు శాశ్వత పరిష్కారంగా సెయిల్‌లో విలీనం చేయాల్సి ఉందన్నారు. సెయిల్‌లో విలీనం కోసం కృషి చేస్తామని పల్లా హామీ ఇచ్చారు.

అల.. చెక్కింది ఇలా..

శిల్పాల్లా రాళ్లు.. ఆకర్షిస్తున్న గుహలు


కనువిందు చేస్తున్న పకృతి అందాలు













ఉవ్వెత్తున ఎగసి పడే **అలలు.. అలుపు సొలుపు లేని కెరటాలు.. ఒక దాని వెంట మరొకటి వస్తూ.. అక్కడ ఉన్న బండ** రాళ్లను సుతారంగా **తాకుతూ.. రాళ్లను అద్భుతమైన శిల్పా**లుగా చెక్కుతున్నాయి. ఆ ప్రదేశాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నాయి. చూపరులను ఆశ్చర్యకితులను చేస్తున్నాయి. శిలలపై శిల్పాలు చెక్కినారు అన్నాడో సినీ కవి.. కానీ ఇక్కడి రాళ్లను చూస్తే.. వాటి ఆకృతులను పరిశీలిస్తే అలలు చెక్కిన శిల్పాలు అని అనాల్సిందే. సువిశాలమైన విశాఖ సాగర తీరంలో.. పెద్దగా ప్రచారం లేని మరోప్రాంతం పెదగంట్యాడ మండలంలోని పాత గంగవరంలో ఉంది. గంగవరం పోర్టు వెనుక గల సముద్ర తీరం ఆహ్లాదాన్ని పంచుతోంది.పర్యాటకులను ఇట్టే ఆకర్షిస్తోంది. ఇక్కడి కొండపై కొలువుదీరిన రాధామాధవ స్వామి ఆలయం వెనుక.. సముద్రం ఒడ్డున ఉన్న ఓ కొండ అందమైన గుహలతో విరాజిల్లుతోంది. కొండను ఆనుకొని సముద్రం ఉండడంతో సాగరం నుంచి వచ్చే అలలు వాటిని తాకుతూ అందమైన శిల్పాలుగా మల్చడంతో ఈ ప్రాంతం ఇప్పుడు ప్రత్యేకంగా నిలుస్తోంది. పర్యాటక కేంద్రంగా మారింది. రాధామాధవస్వామి ఆలయానికి వెళ్లే వారంతా రాళ్ల మధ్య ఆటలాడుతూ.. ఫొటోలు దిగుతూ ఉదయం నుంచి సాయంత్రం వరకూ అక్కడే ఉల్లాసంగా.. ఉత్సాహంగా గడుపుతున్నారు. సుందరమైన సాగర తీరాన్ని ప్రత్యక్షంగా వీక్షించేందుకు యువత క్యూ కడుతున్నారు. – పెదగంట్యాడ

పార్టీని మరింత బలోపేతం చేస్తాం



కూర్మన్నపాలెం జంక్షన్‌లో వైఎస్సార్ విగ్రహానికి నివాళులు



నాగిరెడ్డిని సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త దేవన్‌రెడ్డి

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దేవన్‌రెడ్డి
- దేవన్‌రెడ్డికి ఘన స్వాగతం పలికిన శ్రేణులు

గాజువాక: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాలతో పార్టీని గాజువాకలో మరింత బలోపేతం చేస్తామని ఆ పార్టీ గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్తగా నియమితులైన అనంతరం విజయవాడ నుంచి గాజువాకకు చేరుకున్న ఆయనకు పార్టీ కార్యకర్తలు, నాయకులు కూర్మన్నపాలెం జంక్షన్‌లో ఘన స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా కూర్మన్నపాలెం నుంచి పాత గాజువాక, కొత్తగాజువాక, బీసీ రోడ్ మీదుగా గాజువాక మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ఇంటికి బైక్ ర్యాలీతో తోడ్కొని వెళ్లారు. అనంతరం నాగిరెడ్డితో కొద్దిసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి నాగిరెడ్డి కుటుంబం పార్టీతోనే ఉందన్నారు. గాజువాకలోనే కాకుండా విశాఖ నగరంలో కూడా పార్టీని బలోపేతం చేసేందుకు నాగిరెడ్డి ఎంతో కృషి చేశారన్నారు. ఆయన కృషికి నాయకులు, కార్యకర్తలు కూడా సహకరించారన్నారు. పార్టీ అధినేత జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాలే తమకు శిరోధార్యమని, ఆయనకు రుణపడి ఉంటామన్నారు. భవిష్యత్‌లో ఆయన ఏ పిలుపు ఇచ్చినా పూర్తిస్థాయిలో జయప్రదం చేస్తామన్నారు.

కార్యక్రమంలో కార్పొరేటర్లు తిప్పల వంశీరెడ్డి, మహ్మద్ ఇమ్రాన్, నాయకులు ధర్మాల శ్రీను, పల్లా చినతల్లి, మార్టుపూడి పరదేశి, గొందేశి మహేశ్వరరెడ్డి, బొడ్డ గోవింద్, రావాడ శివ, బోగాది సన్ని, ఎస్.ఎం.డి.గౌస్, మంత్రి శంకర నారాయణ, మద్దాల అప్పారావు, జి.వి.రమణారెడ్డి, సిరట్ల శ్రీనివాస్, ఎన్నేటి రమణ, జి.రోజారాణి, పూడి ఆనంద్, దుగ్గపు దానప్పలు, గాలి ఆనంద్, లోకనాథం, మద్దాల అప్పారావు, దరిగి రవి తదితరులు పాల్గొన్నారు.

పట్టాలెక్కిన అభివృద్ధి పనులు

- దువ్వాడ రైల్వేస్టేషన్ ఆధునికీకరణకు రూ.36 కోట్లు మంజూరు
- అడ్మిన్ భవనం, నాలుగు ప్లాట్‌ఫారాలను అనుసంధానం చేస్తూ ఫుట్ ఓవర్ వంతెన



కొనసాగుతున్న 12 మీటర్ల వెడల్పు ఫుట్‌ఓవర్ వంతెన

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్ ఇప్పుడిప్పుడే ప్రాధాన్యం సంతరించుకుంటుంది. ఆదాయం, ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరగడంతో పాటు తూర్పు కోస్తా జోన్‌లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న రైల్వేస్టేషన్లలో ఒకటి పేరొందింది. దీంతో విశాఖకు ప్రత్యామ్నాయంగా తీర్చిదిద్దేందుకు రైల్వే అధికారులు చకచకా అడుగులు వేస్తున్నారు. ఇందులో భాగంగా దువ్వాడ రైల్వేస్టేషన్‌లో వసతుల కల్పనతో పాటు అభివృద్ధికి రూ.36 కోట్లు మంజూరు చేసింది. ఆ మొత్తాన్ని పలు విభాగాలుగా విభజించి పనులు చేస్తున్నారు.

పనులు వేగవంతం

దువ్వాడ రైల్వేస్టేషన్‌లో పునరాభివృద్ధి పనులు వేగవంతం అయ్యాయి. రూ.36 కోట్లతో ఆధునీకరణ, అదనపు వసతులు కల్పించడం, ముఖద్వారం, ప్రధాన పరిపాలన భవనం, ఫుట్‌ఓవర్ వంతెన మొదలైన సౌకర్యాలు కల్పించే పనులు ప్రారంభించారు. ప్రస్తుతం అభివృద్ధి, అదనపు వసతుల కల్పన పనులు జోరుగా సాగుతున్నాయి. రూ.7కోట్లతో ప్రధాన పరిపాలన భవనం, రిజర్వేషన్ కౌంటర్లు, టికెట్ బుకింగ్ కౌంటర్లు, మేనేజర్, విశ్రాంతి గదుల నిర్మాణం కొనసాగుతోంది. సుమారు రూ.16కోట్ల విలువైన సివిల్ పనులు ప్రస్తుతం కొనసాగుతున్నాయి. అమృత్ భారత్ కార్యక్రమంలో భాగంగా దువ్వాడ పునరాభివృద్ధికి ఏడాదిన్నర కిందట భూమిపూజ చేశారు. మొన్నటి వరకూ నత్తనడకన సాగిన పనులు ప్రస్తుతం పట్టాలెక్కాయి. ఇప్పటికే మొదటి శ్లాబ్ పూర్తయింది. నాలుగో నంబర్ ప్లాట్ ఫారం వైపు రహదారి విస్తరణ, బస్‌బే ఏర్పాటు పనులు దాదాపు పూర్తి కావచ్చాయి. నాలుగో ప్లాట్‌ఫారం విస్తరణ, టైల్స్ ఏర్పాటు పనులు శరవేగంగా సాగుతున్నాయి. సుమారు రూ.8 కోట్లతో 12 మీటర్ల వెడల్పుతో నాలుగు ప్లాట్‌ఫారాలను అనుసంధానం చేస్తూ ఫుట్ ఓవర్ వంతెన (ర్యాంప్ మాదిరి) పనులు ఆర్నెల్ల కిందట ప్రారంభమయ్యాయి. నాలుగో నంబర్ ప్లాట్‌ఫారం 90 మీటర్ల పొడవు విస్తరించడంతోపాటు, సుందరీకరణ పనులు మొదలయ్యాయి. మరో ఏడాదిలో దాదాపు దువ్వాడ రైల్వేస్టేషన్ రూపు రేఖలు మారనుండడంతో ఈ ప్రాంత ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



రహదారి విస్తరణ, బస్‌బే ఏర్పాటు పనులు



నాలుగో నంబర్ ప్లాట్‌ఫారం విస్తరణ పనులు

శ్రామిక్ సంపర్క్ అభియాన్ కరపత్రం ఆవిష్కరణ



కరపత్రం విడుదల చేస్తున్న బీఎంఎస్ నాయకులు

అక్కిరెడ్డిపాలెం: భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్)70వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా విస్తృత కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు బీఎంఎస్ జిల్లా అధ్యక్షుడు రొక్కం సురేష్ కుమార్, రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎంవీఎస్ నాయుడు తెలిపారు.

దీనిలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లో శ్రామిక సంపర్క్ అభిమాన్ పేరుతో లక్ష కుటుంబాలను కలిసి బీఎంఎస్ విశిష్టతను తెలిపేలా రూపొందించిన కరపత్రాన్ని ఆదివారం భెల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ జిల్లాలో ప్రతీ కర్మాగారంలో కార్మిక కుటుంబాలకు చేరువ కావాలన్న లక్ష్యంతో ఈ కార్యక్రమం రూపొందించామన్నారు. బీఎంఎస్ కార్మిక సంఘంగా మాత్రమే కాకుండా సామాజిక బాధ్యత, పర్యావరణ పరిరక్షణ, మహిళా సాధికారత, సామాజిక సామరస్యత, ఆర్థిక స్వావలంబన వంటి అంశాల్లో ప్రజల్లో చైతన్యం తెచ్చే విధంగా పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో బీఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి లోవరెడ్డి, జిల్లా ఇన్‌చార్జి లాలం ప్రసాద్, జిల్లా కార్యదర్శి శరగడం రామచంద్రశేఖర్, వివిధ యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.

సెయిల్‌లో విలీనం చేయాల్సిందే..

అగనంపూడి: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని సెయిల్‌లో విలీనం చేసి ప్రభుత్వరంగ సంస్థగా కొనసాగించాలని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, జె.అయోధ్యరామ్, వి.శ్రీనివాసరావు కోరారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నేతృత్వంలో కూర్మన్నపాలెంలో చేపట్టిన 1438వ రోజు రిలే దీక్షా శిబిరంలో వారు మాట్లాడారు. బ్యాంక్‌లకు సర్దుబాటు, జీఎస్టీ, ఓవర్‌డ్రాఫ్ట్ మినహాయిస్తే ఉత్పత్తి సాధారణ స్థితికి ఎలా వస్తుందని, నేటికీ జీతాలు చెల్లించకపోవడం, జీతాల బకాయిలు ఊసెత్తకపోవడం కేవలం కంటితుడుపు చర్యగా కేంద్ర ప్రభుత్వ తీరు ఉందన్నారు. మంజూరు చేసిన నిధులు సర్దుబాటు కాదని, ప్రైవేటు పరం చేయడానికి సర్దుపోటుగా అభివర్ణించారు. సర్దుబాటు చేసినా ఉక్కు కోలుకోలేదని, జీతాలు చెల్లించలేదనే కారణం చూపించి ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టడమే ప్రభుత్వ లక్ష్యంగా కనపడుతుందని ఆరోపించారు. బలవంతపు వీఆర్ఎస్ ద్వారా ఇప్పటికే 500 మందికి పైగా వెళ్లిపోయారని, భయభ్రాంత్రులకు గురై 750 మంది ఉద్యోగాలు వదిలి వెళ్లిపోయారని, 7500 ఖాళీలు ఉన్నాయని, అయినా మరో వెయ్యి మందిని బయటకు పంపేందుకు కుట్రలు చేస్తున్నారంటే పాలకుల వైఖరి అర్థమవుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్.రామచంద్రరావు, కె.ఎస్.ఎన్.రావు, బిఎన్‌రాజు, రమణమూర్తి, యు.రామస్వామి, రమణారెడ్డి, సురేష్, లక్ష్మణరావు పాల్గొన్నారు.

పౌరాణిక కళాకారులకు సత్కారం



కళాకారులను సత్కరిస్తున్న కార్పొరేటర్లు

అగనంపూడి: సినీ వజ్రోత్సవాలను పురస్కరించుకొని 86వ వార్డు కూర్మన్నపాలెం రామాలయం వద్ద గాజువాక పద్య కళాకారుల సంఘం ఆధ్వర్యంలో సీనియర్ పౌరాణిక కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు లేళ్ల కోటేశ్వరరావు, బొండా జగన్నాథం, రౌతు శ్రీనివాసరావు, మొల్లి ముత్యాలు పాల్గొని 20 మంది కళాకారులను సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు భాష ఔన్నత్యాన్ని, గొప్పదనాన్ని వివిధ రూపాల్లో చాటిచెప్పే కళాకారులను సత్కరించుకోవడం సంతోషంగా ఉందన్నారు. గాజువాక పద్య పౌరాణిక కళాకారుడు, నంది అవార్డు గ్రహీత కురిటి సత్యంనాయుడు మాట్లాడుతూ కళాకారులు ఎంత పేదరికంలో ఉన్నా వారు పోషించే పాత్రల్లో లీనమై కళలను బతికించడానికి పాటుపడుతున్నారన్నారు. అటువంటి వారిని ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు కర్రి ఈశ్వరరావు, కాదా శ్రీను, సంఘ ప్రధాన కార్యదర్శి కట్టా పైడిరాజు, కళాకారులు వెంకటరమణ, కొత్తూరు శివ ప్రసాద్, విందలు వరహాలు, బలిరెడ్డి సత్యనారాయణ, అల్లాడి సత్తిబాబు, నానాజీ, అరికట్ల ఆచారి, బీఎస్‌నాయుడు, చిన్ని రాము, అప్పలనాయుడు పాల్గొన్నారు.

డొంకాడ జాతర రేపు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి సెక్టార్-1 నిర్వాసితకాలనీ డొంకాడ గ్రామంలో సీతారాముల జాతర మహోత్సవాన్ని మంగళవారం నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ ప్రతినిధులు దాసరి త్రినాథ్, సన్యాసిరావు, కరణం శ్రీను, అట్టా అప్పారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో కోలాటం, సాము గరిడీలు, భజన కార్యక్రమం నిర్వహించనున్నామని వారు చెప్పారు.

రేపు పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్‌మేళా

పెందుర్తి: స్కిల్ డెవెలప్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో పలు ప్రైవేటు కంపెనీల్లో ఉపాధి నిమిత్తం మంగళవారం స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వివిధ కంపెనీల్లో 250 పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు.

కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్న కేంద్రం



ఏఐవైఎఫ్ పతాకావిష్కరణ చేస్తున్న ప్రతినిధులు

పెందుర్తి: కేంద్ర ప్రభుత్వం నిరుపేదల బతుకులపై భారం మోపి, కార్పొరేట్లకు కొమ్ముకాస్తోందని అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) రాష్ట్ర సహాయ కార్యదర్శి మహంకాళి సుబ్బారావు విమర్శించారు. ఏఐవైఎఫ్ విశాఖ జిల్లా నిర్మాణ మహాసభ ఆదివారం పెందుర్తిలో నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ దేశ సంపదను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ కంపెనీలకు దోచిపెడుతున్నాయన్నారు. యువతకు 2 కోట్ల ఉద్యోగాలని మభ్యపెట్టి గద్దెనెక్కిన ప్రధానమంత్రి మోదీ, యువతను దారుణంగా మోసం చేశారని ఆరోపించారు. దేశ జీడీపీ వృద్ధిరేటు క్షీణిస్తున్నా తప్పుడు ప్రచారాలతో దేశం అభివృద్ధి చెందిందని ప్రజలను మభ్యపెడుతున్నారని ధ్వజమెత్తారు. వచ్చే నెల 6, 7, 8, 9 తేదీల్లో శ్రీకాకుళంలో తలపెట్టిన ఏఐవైఎఫ్ 22వ రాష్ట్ర మహాసభల్లో దేశం, రాష్ట్రంలో జరుగుతున్న ప్రజావ్యతిరేక పాలన, యువతకు జరుగుతున్న అన్యాయాలపై గళమెత్తనున్నట్లు ప్రకటించారు.